

పరేషన్

కొత్త ప్రభుత్వం తొలివిడతలోనే పేదలకు మొండిచేయి చూపింది. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే కందిపప్పు, చక్కెర కార్డు దారులకు అందే పరిస్థితి లేదు.

- 8లో..



లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు గెలుపు

లోక్‌అదాలత్‌లో వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడం వలన ఇరువర్గాలు గెలిచినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జూలై 6న బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్

ఒంగోలు: ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ, ఫార్మసీ, యానిమేషన్, ఓవర్సీస్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలు, యూనివర్శిటీల వివరాలను ఒకేచోట తెలుసుకునేలా తమ సంస్థ ఆధ్వర్యంలో జూలై 6న మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ సంస్థ అధినేత షేక్ న్యామతుల్లా బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లచే మాక్ వెబ్ కౌన్సెలింగ్, సెమినార్లు, కెరీర్ కౌన్సెలింగ్, ఎడ్యుకేషనల్ లోన్లపై బ్యాంకర్స్‌తో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులలో ఇద్దరికీ లక్కీ డ్రా ద్వారా ల్యాప్‌టాప్‌లు బహూకరిస్తారని చెప్పారు. ఈ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో జరుగుతుందని, జిల్లా నలుమూలల నుంచి ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత ల్యాప్‌టాప్ లక్కీ డ్రా కూపన్ల కోసం, ఇతర వివరాలకు స్థానిక అంజయ్య రోడ్డులోని తమ సంస్థను సంప్రదించాలన్నారు.వివరాలకు సెల్ నెంబర్లు 8179499799, 8019479999లను సంప్రదించాలన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ ఎం నరేంద్రనాథ్ తెలిపారు. మొదటి విడతలో వివిధ ట్రేడ్‌లలో ఖాళీలను భర్తీ చేసేందుకు పదో తరగతి పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చేనెల 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు నమోదు చేసుకోవాలన్నారు. https://iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నమోదుచేసి జిరాక్సులను తమకు అందజేయాలని తెలిపారు.

టీటీడీ చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలి

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 60 లక్షల మంది యాదవులు ఉన్నారని, అలాంటి సామాజిక వర్గానికి టీటీడీ చైర్మన్ పదవి కేటాయించడం న్యాయం అన్నారు.

ఫీజులుం

- యథేచ్ఛగా ప్రైవేటు పాఠశాలల దోపిడీ
- ఒకటో తరగతికే కనీసం రూ.25 వేలు ఫీజు
- కార్పొరేట్‌లో మరింత భారం
- బస్సు ఫీజులు సైతం ఏడాదికి రూ.10 వేలు
- ఇక యూనిఫాం, నోటు పుస్తకాలు, మెటీరియల్ భారం అదనం
- ప్రభుత్వ పాఠ్యపుస్తకాల స్థానంలో ప్రత్యేక పుస్తకాల వినియోగం



ప్రైవేటు చదువులు విద్యార్థుల తల్లిదండ్రులకు పెనుభారంగా మారుతున్నాయి. వేలకు వేలు ఫీజులకు తోడు యూనిఫాం, టై, బెల్టు, బూట్లు, మెటీరియల్, పుస్తకాలు అన్నీ తాము చెప్పిన చోటే తాము చెప్పిన రేటుకే కొనాలంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆంక్షలు విధిస్తున్నాయి. బస్సు ఫీజులూ మోతమోగిస్తున్నారు. ఫలితంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారు.

ఒంగోలు:

పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. యాజమాన్యాలు నిబంధనలు బేఖాతరు చేస్తున్నా కనీసం అటువైపు కన్నెత్తిచూసే అధికారులు కనిపించడం లేదు. ఒకటో తరగతికే ఫీజు రూ.25 వేలు పైనే ఉంటుండడంతో మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతోంది. దీనికితోడు యూనిఫాం, మెటీరియల్, నోట్సులు అదనం, ఇవి కాకుండా ఇక బస్సు ఫీజులు అయితే మరింత భారం. దీంతో ఒకటో తరగతి విద్యార్థికే దాదాపు రూ.40 వేల వరకు భారం పడుతోంది. చివరకు కొంతమంది ఈ భారాన్ని తట్టుకోలేక తాము ప్రభుత్వ పాఠశాలలకు వెళతాం టీసీలు ఇవ్వమంటుంటే ససేమిరా అంటూ ప్రైవేటు పాఠశాలలు మొండికేస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఇటీవల సంచార జాతులకు చెందిన ఒక మహిళ జిల్లా విద్యాశాఖ అధికారి వద్ద మొరపెట్టుకున్నారు.

నిబంధనల అమలుకు కనిపించని కమిటీలు:

నిబంధనల అమలుకు కనీసం కమిటీలు కూడా కనిపించడం లేదు. త్రీమెన్ కమిటీ రూపంలో మండల విద్యాశాఖ అధికారి, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్, ఒక క్లస్టర్ స్కూలు హెడ్మాస్టర్లతో ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉండగా అవి అమలు కావడం లేదు. ఇక మానసికంగా, శారీరకంగా విద్యార్థులు ఉండాలంటే అందుకు తగ్గ వాతావరణం ఉండాలి. వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంతోపాటు ఆట స్థలం కూడా ఉండాలి. కానీ అటువంటి పరిస్థితులు ఏవీలేవు. అసలు బహుళ అంతస్తుల భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నా అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాస్తవ రూపంలో అవి అమలుకు నోచుకోవడంలేదు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నా, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా పరిశీలిస్తామని చెప్పడం తప్ప అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఒకటో తరగతికే రూ.25 వేలు ఫీజు

గతంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై నిరంతరం నిఘా కొనసాగేది. ఫీజుల దోపిడీకి సంబంధించి సైతం అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. దీంతో యాజమాన్యాలు కొంత వరకు వెనుకాడేవి. 2020 విద్యావిధానం ప్రకారం గత ప్రభుత్వం రాష్ట్రంలో పాఠశాల విద్యకు సంబంధించి మూడు రకాల ఫీజులు ప్రకటించారు. ఈ ఫీజులన్నీ కూడా 2023–24 విద్యా సంవత్సరం వరకు అమలులో ఉంటాయి. దాని ప్రకారం నర్సరీ మొదలు పదో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అయితే రూ.10 వేలు మొదలు రూ.12 వేల వరకు వసూలు చేయాల్సి ఉంటుంది. ఇక మున్సిపాల్టీల్లో రూ.11 వేలు మొదలు రూ.15 వేల వరకు, కార్పొరేషన్ ప్రాంతాల్లోని పాఠశాలల యాజమాన్యాలు రూ.12 వేలు మొదలు రూ.18 వేల వరకు వసూలు చేయాలి. కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే పాఠశాలల యాజమాన్యాలు ఏమాత్రం బేఖాతరు చేయడంలేదు. నర్సరీ విద్యార్థికి రూ.25 వేలు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా యూనిఫాం పాఠశాల సూచించిన షాపులోనే కొనుగోలు చేయాలనే ఆంక్షలతో పాటు, టై, బెల్టులు పాఠశాలలోనే కొనుగోలు చేయాలి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు మాత్రమే వినియోగించాలని నిబంధన ఉన్నా అవి ఏమాత్రం అమలు కావడం లేదు. ప్రత్యేకంగా మెటీరియల్ రూపొందించి వాటిని విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు.

అదనంగా రూ.5 వేలు ఫీజు:

గత ప్రభుత్వం ఒక తల్లికి ఎంతమంది బిడ్డలు పాఠశాలలో చదువుతున్నా ఒకరికి మాత్రమే రూ.15 వేలు అమ్మ ఒడి పథకం కింద ఇచ్చేది. అయితే తాజాగా టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ప్రతి బిడ్డకు రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో ఇస్తామని ప్రకటించడంతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఆ ప్రకటనను తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నాయి. రూ.5 వేలు అదనంగా కట్టాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుంటే రూ.5 వేలు కట్టలేరా అంటూ యాజమాన్యాలు మాట్లాడుతుండడంతో ఆశ్చర్యపోవడం తల్లిదండ్రుల వంతవుతోంది. చివరకు ప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలను సైతం ప్రైవేటు యాజమాన్యాలు తమకు అనుకూలంగా మెరల్చుకుంటున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక ప్రైవేటు పాఠశాల యాజమాన్యం 3, 5, 6 తరగతుల పిల్లలకు రూ.75 వేలు ఫీజు చెల్లించాలంటూ భవాని అనే పేద విద్యార్థి తల్లికి స్పష్టం చేసింది. తనకు ఇక్కడ చదివించే స్థోమత లేదని టీసీ (బదిలీ సర్టిఫికెట్) ఇస్తే తాను ప్రభుత్వ బడిలో చదివించుకుంటానని వేడుకుంది. కానీ టీసీ ఇచ్చేందుకు సదరు యాజమాన్యం నిరాకరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అయితే దీనిపై ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం కిలోమీటరుకు విద్యార్థుల వద్ద నుంచి బస్సు ఫీజు రూ.1.20 మాత్రమే వసూలు చేయాల్సి ఉన్నా రూ.10 వేలు మొదలు రూ.12 వేల వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. దీనిపై అధికారులు తమ దృష్టికి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప తాము ఎన్ని పాఠశాలలు తనిఖీ చేసింది, ఏయే పాఠశాలల్లో ఎటువంటి లోపాలు ఉన్నాయి, వాటి నియంత్రణకు యాజమాన్యాలకు చేసిన సూచనలు ఏమైనా ఉన్నాయా అనేది మాత్రం ప్రకటించలేకపోతుండడం గమనార్హం.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి





జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనతో పాటు, విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కొత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన స్థానిక పాత జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ వ్యవసాయ, సంబంధిత శాఖల కార్యకలాపాలు, విద్యాశాఖ, డీఆర్‌డీఏ , ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ వంటి వాటిపై సమీక్షించారు. ఈ శాఖల వారీగా జెడ్పీటీసీలు, ఎంపీపీ లేవనెత్తిన అంశాలకు సంబంధించి ఆ శాఖల అధికారులు నివేదికలు తయారు చేసి ప్రజాప్రతినిధులకు అందజేయాలని జేసీ గోపాలక్రిష్ణ రొణంకి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి టీడీపీకి చెందిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి హాజరు కాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు.



■ ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలు మన మీద పెట్టిన నమ్మకాన్ని ప్రజాప్రతినిధులు నిలబెట్టుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా వెనుకబడి ఉండడంతో సాగునీరు తాగునీటి కోసం ఎన్నో కష్టాలు పడుతున్నామన్నారు.

■ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ 2016 నుంచి 2022 మధ్య కాలంలో విద్యార్థుల హాజరు 40 వేల నుంచి 41 వేలు మధ్యలో ఉందా, 2023 నాటికి 28,718 అని ఇచ్చారు, ఇంత హాజరు తగ్గిందా అని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులకు కిట్స్ వందశాతం పంపిణీ చేశారా అని అడిగారు. పిల్లలకు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదని, మండల కేంద్రాల్లో పుస్తకాలు ఉన్నా పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు పంపిణీ చేస్తే బాగుండేదన్నారు. పాఠశాలల్లో ముఖ్యంగా సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉందని తెలిపారు. టీచర్లు ఎక్కడైతే ఎక్కువగా ఉంటారో వారిని కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేస్తే ఫలితాలు బాగుంటాయని తెలిపారు. 10 పాఠశాలలు అప్‌గ్రేడ్ చేశారని వాటిలో కేవలం ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే కాకుండా సైన్స్ గ్రూపులు బైపీసీ, ఎంపీసీ లు ఏర్పాటు చేయాలని కోరారు. 24 డిపార్టుమెంట్ స్కూల్స్ ఉన్నాయని వాటిలో ఎంత మంది ఉన్నారు, ఎంత మంది పాసయ్యారో వారి రిజల్ట్స్ కావాలన్నారు.





■ ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయిన తర్వాత 15 రోజుల నుంచి చాలా గ్రామాల్లో పెన్షన్లు తొలగిస్తారనే ప్రచారం ఉందని, మా దృష్టికి చాలా ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. గతంలో వలంటీర్లు ఉంటే పింఛన్ల పంపిణీ సజావుగా జరిగిపోయిందన్నారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థను పక్కనపెట్టారని, ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది ద్వారానే ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేస్తారని చెబుతున్నారన్నారు. గతంలో పింఛన్లు వచ్చిన వారికి ఆగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ చేయూత కూడా ఎన్నికల కోడ్ వచ్చిందని ఆపారని చెప్పారు. కొందరికే నగదు పడిందని, అందరికీ ఇవ్వాలని కోరారు. ఏ మండలాల్లో ఎంతమందికి ఇచ్చారు ఎంతమందికి ఆగిందని అడిగారు. స్త్రీనిధి, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలన్నీ కొనసాగిస్తున్నారా, కొత్తప్రభుత్వం నిర్ణయం తీసుకునే దాకా ఆపుతారా అని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు సంబంధించిన పథకాలు లేవన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యానికి సంబంధించి ప్రజలకు సహాయ సహకారాలు ప్రజాప్రతినిధులు అందించాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు 98 శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచివారేనన్నారు. వారికి ఏ ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అయినా టీడీపీ అయినా వారి వారి గ్రామాల్లోని సమస్యలను సామరస్యంగా ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.మాధురి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



■ దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో రెండు మోడల్ స్కూళ్లు ఉన్నాయని, వాటిలో హాజరు ఎలా ఉందని, అడ్మిషన్లు ఎలా తీసుకుంటున్నారని ప్రశ్నించారు. 7,8,9 తరగతుల ఖాళీలను ఎలా భర్తీ చేస్తున్నారని, ఉన్న హాజరుకు వందమందికి మాత్రమే హాస్టల్ సదుపాయం ఉందని, హాస్టల్‌కు సంబంధించిన మార్గదర్శకాలపై అడిగారు. ముండ్లమూరులో మోడల్ స్కూల్‌లో హాస్టల్ లేదని, హాస్టల్ సమాచారం మీ దగ్గర ఏమైనా ఉందా అని అడిగారు. దర్శి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వాటర్‌ప్లాంట్‌లు కట్టారన్నారు. వీటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, పని చేయనివి ఎన్ని, ఎన్ని రోజుల నుంచి పనిచేయడం లేదో మా దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. దర్శి బాలికోన్నత పాఠశాలలో, ముండ్లమూరు మోడల్ స్కూల్‌లో నీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వీటి సమాచారం తెలిపాలని కోరారు.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

ఒంగోలు: మెగా డీఎస్సీ 2024 పరీక్షల ఉచిత శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి అర్హులైన బీసీ, ఎస్‌సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు యం.అంజల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తేదీ నుంచి 60 రోజులపాటు ఉచిత శిక్షణ ఉంటుందని, ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ , స్టడీ మెటీరియల్ ఇస్తారన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం, వారికి వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ మార్కుల నకలు పత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ నకలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జూలై 8వ తేదీలోపు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్, ఒంగోలు, ప్రకాశం జిల్లాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఏపీబీసీ స్టడీ సర్కిల్, ఒంగోలు, ల్యాండ్ లైన్ నెంబర్ 08592–231232, 9989285530, 8985090926ను సంప్రదించాలన్నారు.

కథలు చెప్పొద్దు..సక్రమంగా పనిచేయండి



కలెక్టరేట్ విభాగాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: సక్రమంగా విధులు నిర్వహించకుండా కారణాలు, కథలు చెప్పదని సక్రమంగా పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్‌లు, సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ప్రకాశం భవనంలో కలెక్టరేట్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విభాగాల్లో సిబ్బంది వద్దకు వెళ్లి దస్త్రాల నిర్వహణపై ఆరా తీశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న దస్త్రాలపై వివరణ అడిగారు. సిబ్బంది ఇచ్చిన సమాధానాలకు అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ సిబ్బందిపై మండిపడ్డారు. ఇన్‌వార్డ్, డిస్‌ప్యాచ్ రిజిస్టర్‌లు ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలన్నారు. పెండింగ్ లేకుండా పనులు చేయాలని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఇతర విభాగాల సూపరింటెండెంట్‌లు నాగిరెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

సహానుభూతితో వైద్యం చేయాలి

ఒంగోలు టౌన్: వైద్య విద్యనభ్యసిస్తున్న మెడికోలు వైద్యశాలకు చికిత్స కోసం వచ్చిన వారికి సానుభూతితో కాకుండా సహానుభూతితో వైద్యం చేయాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డా.చలమయ్య సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థులకు నిర్వహించిన గుడ్ క్లినికల్ ప్రాక్టీస్ వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ కోసమే కాకుండా చికిత్సలో భాగంగా రోగితో మమేకం కావడం, ప్రజలతో కలగలిసిపోవడం లాంటివి పబ్లిక్ స్కిల్స్ తెలిసి వస్తాయన్నారు. ఓర్పుగా రోగి చెప్పింది వినడం, నేర్పుగా వైద్యం చేయడం ముఖ్యమన్నారు. ఒంగోలు మెడికల్ కాలేజీలో మొదటిసారిగా ఇలాంటి సెమినార్ నిర్వహించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు చెప్పారు. తరచుగా ఇలాంటి సెమినార్లు నిర్వహించడం వలన మెడిసిన్ పూర్తి చేసిన తరువాత వైద్యరంగంలో రాణించడానికి ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వెల్డర్ మృతి



మృతిచెందిన జానీ

సింగరాయకొండ: రోడ్డు ప్రమాదంలో వెల్డర్ మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం మండల కేంద్రమైన సింగరాయకొండలోని దేవీ సీఫుడ్స్ కంపెనీ సమీపంలో ఆర్అండ్బీ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రాజమండ్రికి చెందిన షేక్ జానీ (40) చాలా కాలంగా స్థానికంగా వెల్డర్గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం దేవీ సీఫుడ్స్ సమీపంలోని దుకాణానికి వెళ్లి తిరిగి వస్తూ ఆగి ఉన్న ఖాళీ కంటైనర్ పక్కన నడుస్తున్నాడు. అది గమనించని కంటైనర్ డ్రైవర్ షేక్ సనావుల్లా కంటైనర్ను స్టార్ట్ చేసి ముందుకు పోనీయడంతో జానీకి తగిలి కిందపడ్డాడు. లారీ ముందు చక్రం జానీ మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. జానీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్కి తరలించనున్నట్లు చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

ఒంగోలు టౌన్: రైలు పట్టాలు దాటుతున్న ఒక వృద్ధురాలిని గూడ్స్ రైలు ఢీకొనడంతో ఆమె మరణించింది. నగరంలోని క్లోపేటకు చెందిన కొమ్ము రాములమ్మ (65) శనివారం సాయంత్రం రాజీవ్ గృహకల్పలో నివసించే తన కూతురు వద్దకు వెళ్లేందుకు బయలుదేరింది. రైలు పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్లే గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్కి తరలించారు.

చక్కని హాస్యానికి చిరునామా.. జంధ్యాల

అద్దంకి: ఉత్తమ పాత్రలు ధరించిన తొలి తరం కథానాయికలలో జమున ఒకరని దాసరి లక్ష్మీరాజ్యం అన్నారు. పట్టణంలోని చిన్న శాంతయ్య పిచ్చమ్మల సేవాసదన్లో శనివారం ప్రతిభా మూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ రంగస్థల నటుడు ఆలకుంట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సినీ దర్శకుడు హాస్యబ్రహ్మ జంధ్యాల గురించి సాహితీ స్రవంతి అధ్యక్షుడు నారాయణబావు మాట్లాడుతూ చక్కని హాస్యానికి చిరునామా జంధ్యాల అన్నారు. ఎన్నో హాస్యాత్మక చిత్రాలు అందించి తెలుగు వారికి ఆరాధ్య దర్శకుడిగా పేరు సంపాదించుకున్నాడని కొనియాడారు. ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. చందలూరి నారాయణరావు, మంగమూరి చిరంజీవి , సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పరేషాన్



వై. పాలెంలోని సీఎస్ గోడౌన్



గోడౌన్లో నిల్వ ఉన్న బియ్యం, పంచదార

- కందిపప్పు, పంచదార హుళక్కే!
- రేషన్ దుకాణాల్లో స్టాక్ ఉన్నా.. పంచదార పంపిణీ చేయవద్దని ఆదేశాలు

యర్రగొండపాలెం: ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే కందిపప్పు, పంచదార, కార్డుదారులకు అందే పరిస్థితి లేదు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తొలివిడతలోనే పేదలకు మొండిచేయి చూపింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసే బియ్యం మాత్రం జూలై 1వ తేదీ నుంచి సరఫరా చేయనున్నారు. బియ్యంతో పాటు కిలో కందిపప్పు, అర కిలో పంచదార సబ్సిడీ ధరలకు కార్డు దారులకు అందివ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు సీఎస్ గోడౌన్లలో అవి నిలువ లేక పోవడంతో రేషన్ షాపులకు పంపిణీ జరగలేదు. అరకొరగా ఉన్న పంచదారను కార్డుదారులకు పంపిణీ చేయవద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఆగస్టు నెల నుంచి పూర్తి స్థాయిలో కందిపప్పు, పంచదార కార్డు దారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని ఒక అధికారి తెలిపారు.

వందలాది కార్డులు

నియోజకవర్గంలో మొత్తం 84,403 రేషన్ కార్డులున్నాయి. వాటికి 11,96,219 కిలోల బియ్యం, 84,403 కిలోల కందిపప్పు, 42,202 కిలోల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. అందులో బియ్యం మాత్రమే పంపిణీ చేసేందుకు రేషన్ షాపులకు నిలువలు సిద్ధం చేశారు. రేషన్ షాపులో కందిపప్పు కిలో రూ. 67 ఉండగా బహిరంగ మార్కెట్లో రూ. 170 ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. పేదలు అంత ఖరీదు పెట్టి కందిపప్పు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. జూలై నెలలో పచ్చడి మెతుకులతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రేషన్ షాపు డీలర్లు రాజీనామా చేయాలి

రేషన్ షాపు డీలర్లు రాజీనామా చేయాలని అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకొని వెళ్తున్నారు. డీలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారు. బలవంతపు రాజీనామాలు చేయించవద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికి టీడీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయాల్లో తిష్టవేసి తహసీల్దార్, సీఎస్ డీటీలతో డీలర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. కొంతమంది డీలర్లకు నాయకులే ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో మొత్తం 173 రేషన్ షాపు డీలర్లు ఉండగా వారిలో 37మంది పర్మినెంట్ డీలర్లున్నారు. మిగిలిన తాత్కాలిక డీలర్లతోపాటు పర్మినెంట్ డీలర్లు సైతం రాజీనామా చేయాల్సిందేనని టీడీపీ నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. వీరి ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది తాత్కాలిక డీలర్లు రాజీనామాలు చేశారు. సోమవారం నుంచి కార్డు దారులకు రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఈ పాటికి సీఎస్ గోడౌన్ నుంచి బియ్యం నిలువలను రేషన్ షాపులకు చేర్చాల్సి ఉంది. అయితే టీడీపీ నాయకులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే బియ్యం నిలువలు చేరాయి. రేషన్ పంపిణీ జరిగే సమయంలో బయోమెట్రిక్ మిషన్లో డీలర్ లేకుంటే వీఆర్ఏ తమ వేలి ముద్రవేస్తేనే అవి వినియోగంలోకి వస్తాయి. ఈ పరిస్థితుల్లో తాత్కాలిక డీలర్లను పక్కనపెట్టి తమకు ఇష్టం వచ్చినవారికి రేషన్ నిలువలు చేర్పించి వీఆర్వోతో తంబ్ వేయించి బియ్యం పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

నేడు అవయవదాన సదస్సు



కరపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: మనిషి మరణించిన తర్వాత కూడా నలుగురికి జీవితాన్ని ఇచ్చేలా అవయవదానాన్ని ప్రోత్సాహించే సదాశయంతో ఒంగోలులోని కృష్ణప్రియ కన్వెన్షన్ సెంటర్, బాలసింజీవిని ధామంలో ఆదివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. శనివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని ఆయన చాంబర్లో సంబంధిత కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక అవయవదాత సుమారు 8 మందికి పునర్జన్మ ఇవ్వవచ్చని, ప్రస్తుతం అవయవదాతల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు రాష్ట్రంలోని ఇతర వైద్య కళాశాలల విద్యార్థులకు పరిశోధన నిమిత్తం మృతదేహాల కొరత కూడా ఉందని తెలిపారు. ప్రజల స్వచ్ఛందంగా ముందుకొచ్చి మృతదేహాలను వైద్య కళాశాలలకు దానం చేయాలని విజ్ఞప్తి చేశారు. అవయవ దానంపై ఆదివారం నిర్వహించే అవగాహన సదస్సుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు. ఈ కరపత్రం విడుదల కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, హరిత ప్రకాశం ఫౌండేషన్ నాయకులు మోహన్రావు, బి.కృష్ణ, జి.కోటేశ్వరరావు, పి.రమేష్, మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై స్పందించిన అధికారులు



నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

- మండలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు
- ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా మరో 56 ట్రిప్పులు అదనంగా కావాలని విజ్ఞప్తి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో అధికారులు స్పందించారు. ట్యాంకర్ల ద్వారా మరో 56 ట్రిప్పులు అదనంగా కావాలంటూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, భ్రమరాంభికాదేవి తెలిపారు. శనివారం ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ నవకిశోర్, పంచాయతీ కార్యదర్శి మోహనరావులతో కలిసి మండలంలో పలు బోర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్కోరికి 40 లీటర్ల మేర మండల కేంద్రంలోని 10,989 మంది ప్రజలకు నీరు అందాల్సి ఉందన్నారు. ప్రస్తుతం 38000 వేల లీటర్ల నీటిని బోర్ల ద్వారా, ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండల పరిధిలోని 87 బోర్లు ఒట్టి పోయాయని, కేవలం ఆరు బోర్లు మాత్రమే పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి సంబంధించి మరో 56 ట్రిప్పుల ట్యాంకర్ల నీరు కావాలని జిల్లా కలెక్టర్కు నివేదికలు పంపించినట్లు తెలిపారు. పెద్దదోర్నాలలో నీటి ఎద్దడి అధికంగా ఉందన్న తెలియడంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన నియోజకవర్గ ఇన్చార్జి గౌతంరాజు శనివారం మండల కేంద్రానికి వచ్చారు. ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ నవకిశోర్, ఏఈ భ్రమరాంభికాదేవి, పంచాయతీ కార్యదర్శి మోహనరావుతో మండలంలోని నీటి ఎద్దడిపై మాట్లాడారు. మండల కేంద్రంలో నీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని, దానికి సంబంధించిన మండల కేంద్రంలోని పరిస్థితుల నేపథ్యంలో అదనంగా మరో 56 ట్రిప్పుల నీటి కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు జనసేన నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు నాయకులు మురళి, మల్లికార్జునాచారి, యామాదాసయ్య తదితరులు పాల్గొనగా మండలానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొనలేదు.

లోక్ అదాలత్తో ఇరువర్గాలకు గెలుపు



లోక్ అదాలత్లో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు టౌన్: లోక్ అదాలత్లో వ్యాజ్యాన్ని పరిష్కరించుకోవడం వలన ఇరువర్గాలు గెలిచినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 160 సివిల్ కేసులు, 900 క్రిమినల్ కేసులు, 15 ప్రీ లిటిగేషన్ కేసులను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించినట్లు వివరించారు. వ్యాజ్యాల పరిష్కారం ద్వారా 5 లక్షల విలువైన కేసులు, బీమా పరిహారం కేసుల ద్వారా 2 కోట్ల రూపాయలను కక్షిదారులకు చెల్లించినట్లు తెలిపారు. సివిల్ కేసుల్లో వ్యాజ్యాలను పరిష్కరించుకున్న వారికి కోర్టు ఫీజులు తిరిగి ఇవ్వనున్నట్లు చెప్పారు.

కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులకు అభినందనలు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్లో సమస్య పరిష్కారం కోసం జిల్లా అదనపు న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎంతో కృషి చేశారని చెప్పారు.

విద్యార్థినికి వైఎస్సార్ సీపీ నేత రూ. 1 లక్ష సాయం



జెన్నీఫర్ తల్లికి నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత బాదం వేణుగోపాల్

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామానికి చెందిన పల్లాల భాస్కర్రావు కుమార్తె పల్లాల జెన్నీఫర్ లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్లోని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ప్రాణ రక్షణకు కాలేయ మార్పిడి ఒక్కటే మార్గమని వైద్యులు తేల్చి చెప్పారు. దాతల సహాయం కోసం జెన్నీఫర్ తండ్రి భాస్కర్రావు ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తాటిచెర్ల గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత బాదం వేణుగోపాల్, బాదం వెంకటేశ్వర్లు లక్ష రూపాయల నగదు విరాళాన్ని ప్రకటించారు. శనివారం బాధితురాలి తల్లిదండ్రులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా బాదం వేణుగోపాల్ మాట్లాడుతూ జెన్నీఫర్ త్వరగా కోలుకోవాలని, ఇంకా దాతలు సహకరించి జెన్నీఫర్కు నగదు సహాయం చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ అలెగ్జాండర్, రంగస్వామి, చిన్నవెంకటయ్య, కోటయ్య పాల్గొన్నారు.

కుమారుడు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

మార్కాపురం: ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పిన తన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీలో నివాసముండే కలగుంట్ల చెన్నమ్మ కుమారుడు బాలాజీ పట్టణంలోని ఒక గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో అప్రైజర్గా పనిచేస్తున్నాడు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన బాలాజీ.. తిరిగి రాలేదని చెన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయుర్వేదంతో ఆయుష్షు పెంచుకోవాలి

- ఆయుష్ ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ పద్మాజాతి



మాట్లాడుతున్న సీనియర్ వైద్యుడు హరిబాబు

ఒంగోలు టౌన్: ఆయుర్వేద చికిత్స ద్వారా ఆయుష్షు పెంచుకోవాలని ఆయుష్ ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ డి.పద్మాజాతి సూచించారు. నగరంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఉచిత అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ భవనం రఘుపథంలో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం ఎంతో ఉత్తమమని చెప్పారు. ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా వ్యాధిని సంపూర్ణంగా నయం చేస్తుందన్నారు. ప్రకృతి మానవుడికి అందించిన చక్కటి పరిష్కారం ఆయుర్వేదం అని, ఇది మనిషికి దేవుడిచ్చిన వరమని చెప్పారు. అనంతరం పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలకు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిబాబు, డాక్టర్ కరుణాకరరావు, డాక్టర్ శకుంతల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గూడ రామమోహన్రావు, కార్యదర్శి టీవీఎస్ శర్మ, వీవీ చలపతిరావు, కె.వెంకటేశ్వరరావు, నూనె రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ వేసి విచారణ జరిపిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న బాపట్ల ఇన్చార్జి కలెక్టర్ శ్రీధర్

మేదరమెట్ల: సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కోరు.. దుర్గంధం నియంత్రణపై కమిటీ వేసి విచారణ చేపడతామని బాపట్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం తమ్మవరం రోడ్డు సమీపంలో ఉన్న సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్గంధంపై ప్రజాభిప్రాయ సేకరణ, ఫిర్యాదుల కార్యక్రమాన్ని కొరిశపాడు మండల కార్యాలయంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి ప్రమాదకరమైన దుర్గంధాలు తరచూ వస్తున్నాయని, దీని వలన చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురికావాల్సి వస్తుందని, ఈ ఫ్యాక్టరీని తక్షణమే మూసివేయాలని గ్రామస్తులు కోరారు. మిరపకాయల తొడిమలను ఫ్యాక్టరీలో వినియోగించడం ద్వారా కోరు విపరీతంగా వస్తుందని, అది వెలువడే సమయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో 60 టన్నులు ఉత్పత్తి జరిగేదని, ప్రస్తుతం ఈ ఉత్పత్తి 100 టన్నులకు పెంచారన్నారు. దీంతో 40 టన్నుల మిరప పిప్పి, కోరు బయటకు వస్తుందని చెన్నై ఐఐటీ బృందం గుర్తించిందని గ్రామస్తులు తెలిపారు.

చెరువు నీరు కలుషితం...

ఫ్యాక్టరీ వ్యర్థాలను బయటకు వదలడం వలన సమీపంలోని పొలాలు, చెరువులు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో నీళ్లు తాగిన పశువులు మృత్యువాతపడ్డాయని కలెక్టర్కు గ్రామస్తులు తెలిపారు. అన్ని అనుమతులతోనే తాము ఫ్యాక్టరీ నడుపుతున్నామని ఫ్యాక్టరీ ప్రతినిధులు కూడా కలెక్టర్కు తెలిపారు. ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని, దీనిపై కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో పొల్యూషన్ బోర్డు అధికారులు విచారణ జరిపించేలా చూస్తామని అన్నారు. సాంకేతిక నిపుణుల పరిశీలనతో వాస్తవాలు తెలుసుకుంటామని, ఫ్యాక్టరీ పనిచేసే సమయంలోనే సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. అనంతరం విచారణ నివేదికను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, ప్రభుత్వానికి అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సుశీల, గ్రామస్తులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న మేదరమెట్ల గ్రామస్తులు

పేదలకు సేవ చేయడం ఇష్టం

- వీడ్కోలు సభలో జీజీహెచ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హనుమంతరావు



డాక్టర్ హనుమంతరావును ఘనంగా సన్మానించిన వైద్యులు, సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్

ఒంగోలు టౌన్: పరిపాలన పరమైన బాధ్యతల నిర్వహణ కంటే రోగులకు వైద్య సేవలు అందించడానికి ఇష్టపడతానని సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం పదవీ విరమణ చేస్తున్న ఆయనకు జీజీహెచ్లోని ట్రిబుల్ వన్ గ్యాలరీలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ తన 32 ఏళ్ల అనుభవంలో వైద్యుడిగా ఆసుపత్రిలో విధులు నిర్వహించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. సమయపాలన పాటించడం, నిరుపేదలకు వైద్య సేవలను అందించడం ద్వారా సంతృప్తిగా రిటైర్డ్ అవుతున్నట్లు చెప్పారు. సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ హనుమంతరావు చేసిన సేవలను జీజీహెచ్ సిబ్బంది ఎన్నటికీ మరచిపోలేరని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి అన్నారు. పదవీ విరమణ రోజు కూడా విధులు నిర్వహించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని, నేటి తరం వైద్యులకు ఆదర్శనీయంగా నిలిచారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ నిబద్ధతతో కూడిన సేవా గుణం, మృదుస్వభావం కలిగిన సీఎస్ఆర్ఎంఓను ఇంతవరకు చూడలేదని చెప్పారు. వివిధ బాధ్యతలు నిర్వహించినా నిరాడంబరంగా సిబ్బందితో కలిసి పోవడం ఆయనకే చెల్లిందన్నారు. డాక్టర్ హనుమంతరావు పనితీరు గురించి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ ప్రభాకర్ , ఏఆర్ఎంఓలు డా.విజయశ్రీ, డాక్టర్ అనిల్ గుర్తు చేసుకున్నారు. వైద్యశాలకు సంబంధించిన అనేక పనులను వేగవంతంగా పరిష్కరించారని వివిధ విభాగాలకు చెందిన హెచ్ఓడిలు చెప్పారు. సన్మాన సభకు వైద్యశాల హెచ్ఓడీలు, సిబ్బంది తరలివచ్చారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

మార్టూరు: భర్త వేధింపులు భరించలేక భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన మండలంలోని నాగరాజుపల్లిలో శనివారం వెలుగు చూసింది. సీఐ ఎస్వీ రాజశేఖర్రెడ్డి వివరాల మేరకు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన బోయిన శెట్టి చిన్నవెంకటేశ్వర్లు తన మూడో కుమార్తె జడ నందిని అలియాస్ నరసమ్మ (33)ను ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మీనారాయణతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. గత కొన్ని సంవత్సరాలుగా నాగరాజుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి 12 ఏళ్ల వయసుగల ఒక అమ్మాయి. 10 సంవత్సరాల వయసు గల ఒక అబ్బాయి సంతానం ఉన్నారు. గత ఆరు నెలలుగా లక్ష్మీనారాయణ భార్య నందినిని నిత్యం అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో భార్యాభర్తల మధ్య తిరిగి అదే ఘర్షణ జరిగిన అనంతరం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు.

నిత్యం భర్త అనుమానపు వేధింపులతో మనస్థాపానికి గురైన నందిని 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. అనంతరం విషయాన్ని తన అక్క వెంకటలక్ష్మికి ఫోన్ ద్వారా తెలపడంతో ఆమె స్థానికులను అప్రమత్తం చేసింది. మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న నందినిని బంధువులు శుక్రవారం మధ్యాహ్నం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం చిలకలూరిపేటకు తరలించగా పరిస్థితి విషమంగా మారడంతో గుంటూరుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందిని పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి చిన్న వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.